# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 79 వ భాగం

### వృత్తాసుర వృత్తాంతం – 3, హర్యశ్వ, శబళాశ్వులు

దక్ష ప్రజాపతి తపస్సు చేసాక మహా విష్ణువు కనిపించాడు. తాను చేయాల్సిన ప్రజోత్పత్తి పని అయిపోయింది కనక అన్నీ వదులుకుని తపస్సు చేశాడనుకుంటే భగవంతుడు కనిపించాక ఏమైంది? అది ఇప్పుడు తెలుస్తుంది.

వ. ఇట్లు ప్రసన్నుండయిన సర్వేశ్వరుని సర్వంకషంబును మహాశ్చర్యధుర్యంబును నయి తేజరిల్లు దివ్యరూపంబుఁ గాంచి, భయంబును హర్షంబును విస్మయంబును జిత్తంబున ముప్పిరిగొని చొప్పు దప్పింపం దెప్పఁటి, కప్పరపాటునం బుడమిపైఁ జాగిలంబడి, దండ ప్రణామంబు లాచరించి, కరకమలంబులు మొగిడ్చి సెలయేఱుల తొట్టునఁ గొట్టుపడి, యిట్టట్టుఁ బట్టుచాలక నిట్టపొడిచి, మున్నీరుదన్ని నిలచిన పెన్నీరునుం బోలె, సర్వాంగంబులుం దొంగిలింపఁ, జిత్తంబు నాత్మాయత్తంబుజేసి, పిక్కటిల్లిన సంతోషంబుచేత భగవంతుం బలుకను, నత్యంత మంగళ సందోహాపాదకంబు లైన తన్నామంబు లుగ్గడింపను, నతి నిర్మలంబులైన తదీయకర్మంబులు దడవను, విబుధ హర్షకరంబులైన తత్పౌరుషంబులు పొగడను, నాత్మీయ మనోరథంబు వాక్రువ్వను నోపక ప్రజాకాముండై యూరకున్న ప్రజాపతిం జూచి, సర్వజీవ దయాపరుండును, సర్వసత్త్వ హృదంతరస్థుండును, సర్వ జ్ఞుండునుం, గావున నతని భావంబు దెలిసి, జగన్నాథుం డార్తపోషణంబులైన భాషణంబుల నిట్లనియె. [6-221]

కనిపించిన భగవంతుణ్ణి చూసేసరికి వళ్ళు గగుర్పాటుతో భయం, విస్మయం మనసులోంచి తన్నుకు వస్తుంటే ఎలాగో ఒకలాగ కలవరపాటుతో సాష్టాంగ నమస్కారం చేసి దండ ప్రణామాలు అర్పించాడు. మనసులో సంతోషం తన్నుకు వస్తుంటే కనిపించిన శ్రీహరి పేరు పలకడానికి కానీ, ఆయన నామాలు పలకడానిక్కానీ ఏదో చేయాలనుకున్నాడు కానీ నోటమ్మట మాట రాక అలా చూస్తూ కూర్చున్నాడు. అయితే అన్ని జీవుల పట్లా దయకలిగి ఉండేవాడైన భగవంతుడు సర్వజ్ఞుడు కనక అతని మనసులో భావం తెలిసింది. ధ్రువుడికి కూడా అంతే కదా? ఈ విషయమే శ్రీ రామకృష్ణులు కూడా అనేకసార్లు చెప్పడం గమనించవచ్చు.

ఓ పెద్ద గోడ అవతల ఏదో ఉంది. ముగ్గురు బాటసారులు దారమ్మట వెళ్తూ ఆ గోడ అవతల ఏముందో తెలుసుకోవాలనుకున్నారు. ఒకాయన పైకెక్కి అటువేపు చూసి ‘ ఆ! ఆ!!’ అని అటువైపు దూకేసాడు. మిగతా ఇద్దరికీ ఏమీ తెలియలేదు. రెండో ఆయన కూడా అలా గోడమీదకి ఎక్కి అటువైపు దూకే సరికి, మూడో ఆయన కూడా ఎక్కాడు. ఈయన కూడా అంతే, గోడకి ఆ పక్కన చూసి ‘ఆ! ఆ!!’ అంటూ అటు దూకాడు మిగతా ఇద్దరి లాగానే. ఇంతకీ అటువేపు ఏముంది? భగవంతుణ్ణి చూస్తే అలాగే అవుతుంది అంటారు. అందులో లీనమవడమే కానీ వివరించడం కుదరదు. ఎందుకంటే ఏదైతే మనం వివరించగల్గుతున్నామో అది మన బుద్ధి, మనస్సు మీద ఆధారపడి ఉంటుంది కనక మనం వివరించేది అనంతం కాదు; మన మనసు, బుద్ధి

పరిధులలో ఉండేది మాత్రమే మనం వివరించగలం. కానీ భగవంతుడు అనంతుడు, అవ్యక్తుడూ కనక ఆత్మానుభవం ఎవరికివారే తెలుసుకోదగ్గది. ఇదే దక్షుడికి కూడా జరిగిందన్నమాట. ఇప్పుడు దక్షుడు ఏం చేయాలో భగవంతుడు చెప్తున్నాడు.

ఆ. తపము చాలు నింకఁ దగ భూతతతికి వి
భూతు లొనరుఁ గాక పొందుపడఁగ;
నిదియ సుమ్ము మాకు నిచ్చలోఁ గల కోర్కి
పొసఁగ నీదువలనఁ బొందుపడియె. [6-223]

ఇంక తపస్సు చాలు, సమస్త భూతకోటికి శుభం జరగాలి. నా సంకల్పం కూడా అదే. నీ వల్ల ఇదంతా బాగా జరుగుతోంది. ఇక్కడ విష్ణువు ఏమన్నాడో ఓ సారి చూస్తే (భూతతతికి విభూతులొనరుగాక), మనం చేసే ప్రార్థనలలో 'లోకాన్ సమస్తా సుఃఖినో భవంతు' అని ఎందుకంటామో తెలిసి వస్తుంది చూడండి. ఏదైతే మనం ఇస్తామో అదే మనకి అనంతమై తిరిగి వచ్చేది కదా, ఎప్పుడైతే మనం అందరి సుఖం కోరుకుంటామో అదే మనకి కూడా సంప్రాప్తం అవుతుంది. ఇదే విష్ణువు చెప్పేది. అయితే ఇంకా దక్షుడు చేయాల్సిన పని ఉంది. ఆ విషయం చెప్తున్నాడు.

వ. వినుము, బ్రహ్మయు, భర్గుండును, బ్రజాపతులును, మనువులును, నింద్రులును, నిఖిల భూతంబులకు భూతిహేతువులయిన మద్భూతి విభవంబులు; మఱియు, నాకు యమ నియమాది సహిత సంధ్యావందనాది రూపంబగు తపంబు హృదయంబు; సాంగ జపవద్ధ్యానరూపం బగు విద్య శరీరంబు; ధ్యానాది విషయంపు వ్యాపారంబుగా నుండు భావనాది శబ్దవాచ్యంబగు క్రియ యాకృతి; క్రతు జాతంబు లంగంబులు; ధర్మం బాత్మ; దేవతలు ప్రాణంబులు; నిగమంబు మత్స్వరూపంబు; జగదుత్పత్తికి నాది యందు నే నొక్కండన తేజరిల్లుచుంటి; బహిరంతరంబుల వేఱొక్కటి లేక సుషుప్త వ్యవస్థ యందు సర్వంబు లీనం బగుటం జేసి సంజ్ఞామాత్రుండును, నవ్యక్తుండునుగా నుండు జీవుని భంగి నొక్కఁడన యుండుదు; ననంతుండ నై యనంతగుణంబులు గల మాయా గుణంబువలన గుణ విగ్రహం బగు బ్రహ్మాండంబును, నయోనిజుండు స్వయంభువు నగు బ్రహ్మయును నుదయించిరి; మదీయ వీర్యోపబృంహితుండయి మహా దేవుం డగు నా బ్రహ్మ యసమర్థుండునుంబోలె నకృతార్థమ్మన్యమాన మనస్కుండయి, సృజింప నుద్యమించు తఱి తపం బాచరింపు మని నాచేత బోధితుండై, ఘోరంబైన తపం బాచరించి తొలుత సృష్టికర్తృత్వంబు వహించిన మిమ్ము సృజియించె; నంతఁ బంచజన ప్రజాపతి తనూజయగు యసిక్ని యను పేరిట వినుతినొంది యున్న యిక్కన్యకను నీ కిచ్చితి; దీనిం బత్నిఁగాఁ గైకొని మిథునవ్యవాయ ధర్మంబు గలవాఁడవై మిథునవ్యవాయధర్మంబు గల యీ నాతి యందుఁ బ్రజాసర్గంబు నతి విపులంబుగ గావింపం గలవాఁడవు. మఱియు నీకుఁ బిదప నీ క్రమంబున నిఖిల ప్రజలును మన్మాయా మోహితులై మిథునవ్యవాయధర్మంబునఁ బ్రజావృద్ధి నొందించి మదారాధనపరులై యుండ గలవా" రని పలికి, విశ్వభావనుండైన హరి, స్వప్నోపలబ్ధార్థంబునుం బోలె నంతర్ధానంబు నొందె; నప్పుడు దక్షుండు విష్ణుమాయోపబృంహితుం డై పాంచజని యగు నసక్ని యందు హర్యశ్వసంజ్ఞల వినుతిఁ జెందియున్న యయుతసంఖ్యాపరిగణితు లైన పుత్రులం గాంచె; అప్పుడా ధర్మశీలు రైన దాక్షాయణులు పితృనిర్దేశంబునం బ్రజాసర్గంబు కొఱకుఁ దపంబుచేయువారై పశ్చిమ దిశకుం జని, యచ్చట సింధు సముద్ర సంగమంబున సమస్త దేవ ముని సిద్ధగణ సేవితంబై, దర్శనమాత్రంబున నిర్ధూతకల్మషులను నిర్మలచిత్తులనుం జేయుచున్న నారాయణ సరస్సనం బరగు తీర్థరాజంబున నవగాహనంబు చేసి, నిర్మలాంతరంగులై పరమహంసధర్మంబు నందు నుత్పన్నమతు లై ప్రజాసర్గంబు కొఱకుఁ దండ్రి యనుమతంబున నుగ్రతపంబు చేయుచుండ, వారికడకు నారదుండు వచ్చి, యిట్లనియె. [6-224]

"బ్రహ్మ, మహేశ్వరుడు, ఇంద్రుడు, ప్రజాపతులు, వీళ్ళందరూ కూడా నా రూపాలే. యమ, నియమ అనేవాటితో సహా సంధ్యావందనం అనేటువంటి తపస్సు చేసే హృదయం నా రూపమే. దేవతలు ప్రాణం, ధర్మమే ఆత్మ. వేదమే నా స్వరూపం (నిగమంబు మత్స్వరూపంబు). వెలుపలా లోపలా నేను తప్ప మరొకటి లేదు (మరోసారి అదే చెప్పేది – హరి మయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు..). మొదట్లో నా వల్ల ఈ బ్రహ్మాండం,

సృష్టి చేయడానికి బ్రహ్మ పుట్టారు. నాలోంచి పుట్టినా సృష్టి చేయడం తనవల్ల కాదని బ్రహ్మ అనుకున్నప్పుడు తపస్సు చేయమని ప్రేరేపించినది నేనే. అలా ఘోరతపస్సు చేయడం వల్ల నన్ను కనుగొని మిగతా సృష్టి కోసం ప్రజాపతులైన మిమ్మల్ని సృష్టించాడు. పంచజన ప్రజాపతికి అసక్ని అనే కన్యని నీకోసం సృష్టించాను. ఆవిడతో కల్సి ప్రజోత్పత్తి చేసే పని నీదే. వాళ్లకి పుట్టినవాళ్ళు ధర్మంతో నిన్ను సేవిస్తారు." ఇలా చెప్పి ఎలా కనిపించాడో అలాగే అంతార్ధానం అయ్యేడు.

అలా దక్షుడు అసక్ని అనే కన్యని వరించి హర్యశ్వులు అనేవారిని కని వాళ్లని ప్రజోత్పత్తి చేయమని దక్షుడు వినియోగించాడు. ప్రాచేతసనులిలాగానే వీరు కూడా ముందు తపస్సు చేయడానికి పశ్చిమ దిక్కుకేసి వెళ్ళి అక్కడ సింధునది సముద్రంలో కలిసే నారాయణ వనం అనేచోట తపస్సు చేయడం మొదలు పెట్టారు. ఇలా తపస్సు చేసే హర్యశ్వకుల దగ్గిరకి నారదుడొచ్చి చూసాడు. విషయం తెలిసింది. వారితో ఇలా అంటున్నాడు.

సీ. "మీ రతిమూఢులు మీదఁటి గతి గాన;
రెన్నంగఁ బసిబిడ్డ లన్నలార!
పుడమిఁ దా నింతని కడఁ బరికింపరు;
ప్రజలఁ బుట్టింప నే ప్రతిభ గలదు?
అట్లైన నొక్క మహాత్ముఁడు పురుషుండు;
బహురూపములు గల భామ యొకతె
పుంశ్చలి గర్తంబు బురణింప నుభయ ప్ర;
వాహంబు గల నది వఱలఁ గదల [6-225]

ఆ. నంచ యొకటి యిరువదైదింటి మహిమలఁ
గలిగియుండు తెరువు గానరాక
వజ్రనిబిడ మగుచు వరుసఁ దనంతన
తిరుగుఁ గాష్ఠబిలము దేటపడఁగ. [6-225.1]

"అబ్బాయిలూ మీరు మూఢులని తెలిసిపోతోంది మీ నాయన చెప్పినట్టూ ప్రజోత్పత్తి కోసం మొదలుపెట్టిన ఈ తపస్సు చూస్తే. ఈ భూమి ఎటువంటిదో, ఎంత పెద్దదో అనే విషయాలు, ప్రకృతి మాయ అనేవీ మీకు తెలియనే తెలియవు. ఇంక ప్రజోత్పత్తి ఏం చేయగలరు? అన్నింటికీ అలవాలమైన పురుషుడనే మహాత్ముడు ఒకడున్నాడు, బహురూపం కల ప్రకృతి అనే స్త్రీ ఉంది. వాళ్ల వల్ల సంసారం జరుగుతూ ఉంటుంది. ఇందులో ఒక హంస విహరిస్తూ ఉంటుంది. దానికి అనేక మహిమలున్నా దారి తెలియనట్టూ ఈ సంసారం అనే జలప్రవాహం పడే గోతిలో పడుతూ ఉంటుంది." ఆలోచిస్తే, ఇక్కడ నారదుడు చెప్పేది మన గురించే అని తెలుస్తుంది. మానవుల్లో ఉన్న ఆత్మస్వరూపం హంస. అది ఈ శరీరమే తాననుకుంటూ అనేకానేక మహిమలున్నా అవన్నీ తెలినట్టూ గోతిలో పడుతూ ఉంటుంది.

క. వినుఁ డందుల ననురూపము
నను పొందఁగ నెఱుఁగ కాత్మ నాత్మ గురూక్తిం
గొనసాగించెద మను మి
మ్మన నేమియు లేదు మూఢు లని తెలిసి తగన్. [6-226]

అలా ఈ సృష్టి ఎలా జరుగుతుందో అనే రహస్యాన్ని తెలుసుకోకుండా ప్రజోత్పత్తి చేయడానికి తపస్సు మొదలుపెట్టారు. మిమ్మల్ని మూఢులనక ఇంకేమనాలి? నారదుడిలా చెప్పేసరికి ఈ దక్షుడు కుమారులు ఆలోచించడం మొదలుపెట్టారు నారదుడు చెప్పిన విషయమై.

మత్త. పంచవింశతి తత్త్వరాశి కపారదర్పణ మయ్యుఁ దాఁ
గొంచమై పురుషుండు తత్త్వముఁగోరి పట్టఁగ నేర కే
మంచుఁ గించుఁ దలంచువాఁడు కదధ్వ కర్మము జేయఁగా
మంచిలోకము వానికేటికి మానుగా సమకూరెడిన్? [6-234]

ఇరవై అయిదు తత్వాలు ప్రతిబింబించేది పరతత్వం. అటువంటి పరతత్వం తెలుసుకోకుండా ఏవో కర్మలు (కదధ్వ కర్మము) చేస్తూంటే అసలు ఈ పరతత్వం తెలుసుకోవటం ఎలా?

మత్త. చూడ నీ జగమంతయున్ వెసఁ జుట్టి పట్టుక లీల నే
జోడులేక రయంబునం గుడి సుట్టుపట్టి స్వతంత్రముం
గూడి యుండిన కాలచక్రముఁ గోరి చూడని వారి కే
జాడఁగల్గును గర్మ సంగతిఁ జారుమోక్షపదం బిలన్. [6-236]

మొత్తం ఈ సమస్త జగాన్ని పట్టుపట్టి, మాయం చేసే ప్రక్రియ కాల చక్రం అనేదానికి తెలుసు. ముందు ఆ కాలచక్రాన్ని తెలుసుకోకపోతే మోక్షం అనేది ఎలా తెలుస్తుంది? ఇలా ఆలోచించి ఏం చేసారంటే,

సీ. వినవయ్య! భూపాల! మునివరేణ్యుని మాట;
లనువొందఁ దలపోసి వినయ మలర
వలగొని యతనికి వందనంబు లొనర్చి;
తిరిగి యెన్నఁడు రాని తెరువు పట్టి
చయ్యన నేగిరి సహజ సత్త్వబ్రహ్మ;
మయమైన పంకజనయను పాద
పద్మ మరందంబు పానంబు జేయుచు;
మత్తిల్లి నిలిచిన మానసాళి [6-239]

ఆ. బరిణమింప విష్ణుఁ బాడుచుఁ దత్కీర్తి
సరణి మ్రోయు మహతి సంఘటించి
నారదుండు గుణవిశారదుం డెందేనిఁ
జనియెఁ దన్ను జగము సన్నుతింప. [6-239.1]

నారదుడి నోట్లోంచి ఉపదేశం విన్న ఈ హర్యాశ్వులు ఆయనకి నమస్కారం చేసి మోక్షపదం పట్టారు (తిరిగి ఎన్నడురాని తెరవుబట్టి). అలా సత్య బ్రహ్మమయమైన విష్ణు (పంకజనయుడి) పాదాలని స్మరిస్తూ ఆయనలో లీనమైపోయారు. నారదుడిదంతా చూసి సంతోషంతో మహతిమీద నారాయణ కీర్తనం చేస్తూ వెళ్ళాడు. అసలు కథలోకి వస్తే, దక్షుడు వీళ్ళనెందుకు పుట్టించాడు? ప్రజోత్పత్తి కోసం, అదీ శ్రీహరి చేయమని చెప్తే. మరి వీళ్ళిలా మోక్షం కోసం అన్నీ వదులుకుని సన్యసిస్తే దక్షుడి పని పూర్తి కాలేదు కదా?

క. అప్పుడు దక్షుఁడు దనయులు
దప్పి మహాపథము గనుటఁ దగ నారదుఁడే
చెప్పినఁ గప్పిన శోకము
ముప్పిరిగొని చిత్తవృత్తి మూరిం బోవన్. [6-240]

నారదుడు ఈ హర్యాశ్వకులకి మోక్షమార్గం చెప్పాక పోనీ అక్కడ ఊరుకున్నాడా అంటే అదీ లేదు. “ఇదిగో నువ్వు పుట్టించిన కుమారులందరూ ప్రవృత్తి మార్గం విడిచిపెట్టి నివృత్తి మార్గం (మహా పథము) పట్టి నారాయణైక్యం చెందారు,” అని వెనక్కి వచ్చి దక్షుడితో చెప్పాడు. దక్షుడికి చాలా మనోవ్యాకులం కలిగింది. అసలే ఈ కుర్రాళ్ళని కన్నది శ్రీహరి చెప్పినందుకు కదా? అందువల్ల తాను చేయాల్సిన పని పూర్తి కాలేదని బాధ అన్నమాట.

చ. అడలుచు నున్న వచ్చి కమలాసనుఁ డూఱడిలంగఁ బల్కె మున్
పడసిన లీలఁ బుత్రుల నపార గుణాఢ్యులఁ గాంచుమన్న నా
పడఁతుక యందుఁ బల్వురను బన్నుగఁ దా శబళాశ్వ సంజ్ఞలం
బెడఁగగు వారిఁ బుణ్యముల చేర్చినవారి సహస్ర సంఖ్యులన్. [6-241]

శోకంతో (అడలుచు), ఇలా వ్యాకులంతో ఉన్న దక్షుడి దగ్గిరకి కమలాసనుడు (బ్రహ్మదేవుడు, కమలం ఆసనం గలవాడు) వచ్చి ఊరడించి మరోసారి పుత్రులని కనమని చెప్పాడు. ఆయన మాట విని దక్షుడు ఈ సారి అపార గుణాఢ్యులైన శబళాశ్వులనే వారిని తనకిచ్చిన పడతి (అసక్ని) తో పుట్టించాడు. ఇలా పుట్టిన శబళాశ్వులు ఏం చేసారో వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS